క్లుప్తంగా

'యాభై ఏళ్లుగా అర్జీలు ఇస్తున్నాం'



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

సైదాపురం : 'మేము సాగు చేసుకుంటున్న భూములకు హక్కు కల్పించాలని 50 ఏళ్లుగా అర్జీలు ఇస్తున్నాం. ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోలేదు. మీరైనా దయచూపండి' అని కలిచేడుకు చెందిన పలువురు రైతులు కోరారు. వారు శనివారం సర్పంచ్ సురేష్‌తో కలిసి కలిచేడులో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కలిచేడులో 1800 ఎకరాల ఇనాం భూములు ఉన్నాయన్నారు. వాటిలో 50 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. తమకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

రాపూరు: రాపూరు పెట్రోల్ బంకు సమీపంలో శనివారం రాత్రి బైక్ ఢీకొని మహిళ మృతి చెందిందని ఎస్ఐ వెంకటరాజేష్ తెలిపారు. తార(52) అనే మహిళ రోడ్డు దాటుతుండగా రాపూరు నుంచి మర్లపూడికి బైక్‌లో వెళుతున్న నాగరాజు ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. నాగరాజు కూడా తీవ్రంగా గాయపడ్డాడని, అతన్ని స్థానిక ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

కోట : స్థానిక ఎమ్మార్సీలో శనివారం సావిత్రి బాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగంలో విశేష సేవలు అందించిన నలుగురు మహిళా టీచర్లను సావిత్రిబాయి పూలే అవార్డుతో సత్కరించారు. ఎంపీడీవో వేణు, ఎంఈవో మస్తానయ్య మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని సూచించారు.

సమన్వయంతోనే అభివృద్ధి

వెంకటగిరి రూరల్ : గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. తహసీల్దార్ రాంబాబు మాట్లాడుతూ మండలంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపీడీవో కోటేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి పెట్టండి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట అర్బన్ స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంతోపాటు శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలని డీఎస్పీ చెంచుబాబు ఆదేశించారు. ఆయన శనివారం నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. చోరీ కేసుల్లో రికవరీలపై ఆరా తీశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో పేకాట, కోడి పందేలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఐ బాబికి సూచించారు. పట్టణంలోని వ్యాపార కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు.

7, 8 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ

నాయుడుపేట టౌన్ : రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిపాదించిన విద్యుత్ ధరలపై ఈ నెల 7, 8 తేదీల్లో నాయుడుపేట విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నట్టు ఈఈ శ్రీనివాసులు తెలిపారు. వినియోగదారులు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల మధ్య అక్కడికి వచ్చి విద్యుత్ టారిఫ్ ధరలపై సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

దక్కిలి: మండలంలోని దేవులపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై శనివారం ఎస్ఐ శివ శంకర్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి రూ.5,270 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మృతుడు తూర్పుగోదావరి జిల్లా వాసిగా గుర్తింపు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం మల్లాం జాతీయ రహదారి కూడలి సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందిన వ్యక్తి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన గంగాధర్(41)గా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన గంగాధర్ మేనకూరు పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ నాయుడుపేటలో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి స్వగ్రామానికి వెళ్లేందుకు జాతీయ రహదారి కూడలి వద్దకు వచ్చాడు. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీనడంతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సైదాపురంలోని జగనన్న కాలనీలో ఆగిన ఇళ్ల నిర్మాణం





కాలనీలో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన బోరు



కలగానే సొంతింటి కల

చిన్న ఇల్లు అయినా ఏడాదికి ఒకసారి అద్దె పెంచుతున్నారు. దీనికితోడు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబాలను నెట్టుకురావడం పేదలకు భారమవుతోంది. అందుకే చిన్నదైనా సొంత ఇల్లు కట్టుకోవాలని కలలు కంటూ ఉంటారు. ఈ విషయాన్ని గుర్తించిన గత ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో పేదల సొంత ఇంటి కల కలగానే మిగిలిపోయింది.



రూఫ్ లెవల్‌లోనే ఆగిన ఇళ్లు

- ముందుకు సాగని జగనన్న ఇళ్ల నిర్మాణం
- ప్రభుత్వం మారడంతో ఆగిన పనులు
- వంద రోజుల్లో పూర్తి చేస్తామన్న కూటమి ప్రభుత్వం
- ఆ దిశగా చర్యలు చేపట్టని వైనం

సైదాపురం : గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సైదాపురం మండలంలో 36 జగనన్న కాలనీలు ఏర్పాటుచేసింది. వాటిలో అర్హులైన 711 మందికి స్థలాలు ఇచ్చింది. అలాగే గ్రామాల్లో 862 మందికి జగనన్న ఇళ్లు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. జగనన్న కాలనీల్లో 21 ఇళ్లకు మోల్డింగ్ పూర్తయ్యాయి. 48 ఇళ్లు రూఫ్ లెవల్‌కు చేరుకున్నాయి. 7 ఇళ్లు లెంటల్ లెవల్‌కు, 163 ఇళ్లు బేస్ లెవల్ వరకు చేరాయి. జగనన్న ఇళ్లకు సంబంధించి 111 ఇళ్లు పూర్తయ్యాయి. 162 బేస్ లెవల్‌లో, 8 లెంటల్ లెవల్‌లో, 42 ఇళ్లకు శ్లాబ్ వేశారు. మరో 48 రూఫ్ లెవల్‌లో ఉన్నాయి. పేదలు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని కాపురాలు ఉండేందుకు గాను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించింది. కాలనీల్లో పార్కులు, ఆలయాలు, బడి తదితరాలకు స్థలాలు కూడా కేటాయించింది. కాలనీలో నివశించేందుకు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించింది. అంతర్గత రహదారులతో పాటు వీధి వీధికీ ఒక మినీ 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. 2024 అక్టోబర్ 2వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం పేర్కొన్నా ఆచరణలో విఫలమైంది. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేదు.

నిధులు మంజూరు చేయాలి



పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు గత ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. పేదల సొంత ఇంటి కలను నెరవేర్చాలి.

– దామోదరరాజు, ఆర్‌వైజీపాళెం, సైదాపురం మండలం

త్వరలో పనులు చేపడతాం

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ఆగిన విషయం వాస్తవమే. త్వరలో పనులు చేపడతాం. కొంత మంది నిర్మాణం పూర్తి చేసుకుని కాపురాలు ఉంటున్నారు. మిగిలిన ఇళ్లను మార్చి లోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాం. కాంట్రాక్టర్ ద్వారా పనులు పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా 895 ఇళ్లకు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేశాం. అవి కూడా త్వరలోనే మంజూరవుతాయి.

– జి.శ్రీనివాసులు, హౌసింగ్ ఇన్‌వార్జి ఏఈ

సీసీరోడ్లకు నిధులు మంజూరు చేయాలని వినతి



ఎంపీతో మాజీ ఎమ్మెల్యే కిలివేటి, ఎంపీపీ అరుణారెడ్డి

ఓజిలి: మండలంలో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయాలని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి కోరారు. ఆమె శనివారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డితో కలిసి తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తిని కలిశారు. మండలంలోని పున్నేపల్లి, నెమళ్లపూడి, భట్లకనుపూరు, కర్రబల్లవోలు తదితర గ్రామాల్లో సీసీరోడ్లకు ఎంపీ నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఆరుగురు రైతులపై పోలీసులకు ఫిర్యాదు

కలువాయి: మండలంలోని మాదన్నగారిపల్లికి చెందిన ఆరుగురు రైతులపై తహసీల్దారు శ్యామ్ సుందర్‌రాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్లు 223, 224లోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని పల్లె వనం బ్లాక్ ప్లాంటేషన్, స్టేడియం నిర్మాణానికి కేటాయించారు. అందులో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పనులు చేపట్టేందుకు ప్రయత్నించారు. గ్రామానికి చెందిన ఎస్.నరసింహులు, ఎస్.అంజయ్య, ఎస్.చిన్నయ్య, ఎస్.రామయ్య, ఎస్.పెంచలనరసయ్య, కొమ్మి అంజయ్య వారిని అడ్డుకుంటున్నట్టు ఎంపీడీవో లేఖ అందజేశారని తహసీల్దార్ తెలిపారు. ఈ క్రమంలో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఆట పాటలతో విద్యనందించాలి

దక్కిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో విద్యను అందించాలని వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీ హెచ్ఎం పెంచలయ్య తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఈసీసీఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ కార్యక్రమాల ద్వారా పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలని తల్లిదండ్రులకు సూచించారు. సూపర్‌వైజర్ పరిమళ, అంగన్‌వాడీ వర్కర్ ధనలక్ష్మీ పాల్గొన్నారు.

చిన్నారుల్లో పాఠశాలపై మక్కువ పెంచాలి

పెళ్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ప్రాథమిక పాఠశాలలపై మక్కువ పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మీ సూచించారు. చిల్లకూరు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ సంసిద్ధత కార్యక్రమం చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్ మల్లెమ్మ, ఆయా వాణి పాల్గొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

గూడూరు రూరల్ : వివిధ కార్యక్రమాలు నిర్వహించి పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబీ తెలిపారు. గూడూరులోని సీతమ్మ స్కూల్ ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ సంసిద్ధత కార్యక్రమం నిర్వహించారు. నరసింగారావుపేట సెక్టార్ సూపర్‌వైజర్, హైమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు బీవీ రమణమ్మ, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట పాటలతో విద్యాబోధన చేస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో సునందన తెలిపారు. ఆమె శనివారం గోనుపల్లి పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల తల్లులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఐదేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూల్‌లో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్త రమ్య పాల్గొన్నారు.

నేడు వాకాడుకు నేదురుమల్లి రాక

వాకాడు : వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం వాకాడులో పర్యటించనున్నట్టు నాయకులు తెలిపారు. ఆయన ప్రతి ఏటా నూతన సంవత్సర వేడుకలను వాకాడులోని స్వగృహంలో జరుపుకుంటారని, ఈ ఏడాది కొన్ని అనివార్య కారణాల వల్ల రాలేదని తెలిపారు. ఇందులో భాగంగానే ఆదివారం వాకాడుకు వస్తున్నారని వెల్లడించారు. ఆయన కార్యకర్తలు, నాయకులతో కలిసి మాట్లాడతారని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీ దేవి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. 5 గంటలకు తిరుప్పావై, 6 గంటలకు పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. తదుపరి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ చేపట్టారు.

అంధులకు వరం బ్రెయిలీ లిపి

చిల్లకూరు : బ్రెయిలీ లిపి అంధులకు వరమని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బండ్ల సుధాకర్ తెలిపారు. ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో విద్యార్థులకు బ్రెయిలీ లిపిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జన్యుపరమైన లోపం వల్ల అంధత్వం కలుగుతుందన్నారు. అంధులను అంధత్వ పాఠశాలల్లో చేర్పించి వారికి బ్రెయిలీ లిపి ద్వారా విద్యను అందిస్తే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవయ్య, చంద్రశేఖర్, ప్రజేంద్రరెడ్డి, మస్తాన్, కామేశ్వరి సుగుణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం

దక్కిలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబు మాట్లాడుతూ బ్రెయిలీ లిపి అంధులకు వరమని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బ్రెయిలీ కిట్‌లు పంపిణీ చేశారు. ఐఆర్‌ఈటీ బాలమేరి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

సూళ్లూరుపేట : గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో గోకులకృష్ణ కళాశాల విద్యార్థులు 11 ఈవెంట్స్‌లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపాళ్లు ముచ్చకాల సురేష్, బాలగాని పవన్‌కుమార్ తెలిపారు. వారు శనివారం మాట్లాడుతూ కబడ్డీ, బ్యాడ్మింటన్, 400 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, 100×4 రిలే డిస్క్‌త్రో, జావెలింగ్ త్రో, హైజంప్, షాట్‌పుట్ పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. విద్యార్థులను కళాశాల యజమానులు జీ బ్రహ్మయ్య, ఎంఎం కొండయ్య, సీ శ్రీనివాసబాబు, కళాశాల పరిపాలనాధికారి గుర్రం మనోహర్ అభినందించారు.



స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



బాలాయపల్లి: గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు అర్జీ అందజేస్తున్న బాధితుడు లక్ష్మయ్య.



ఓజిలి: గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ పద్మావతి

దక్కిలి/బాలాయపల్లి (సైదాపురం) : రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం డక్కిలి మండలంలోని వెలికల్లు, మండల కేంద్రమైన బాలాయపల్లిలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. కొంతమంది నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి సర్వే నంబర్లు 5.5ఏలో ఉన్న 1.5 ఎకరాల భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బాలాయపల్లి మండలానికి చెందిన బొల్లినేని లక్ష్మయ్య సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన సబ్‌కలెక్టర్ దీనిపై పరిశీలించి నివేదికను సమర్పించాలని తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు. కార్యక్రమంలో డక్కిలి, బాలాయపల్లి తహసీల్దార్లు ఎం.శ్రీనివాసులు, శ్రీనివాసులు, బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు పది అర్జీలు

పెళ్లకూరు : మండలంలోని జీలపాటూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పది అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ కందమూడి శివకుమార్, ఆర్ఐ సంతోషిని బాయి, వీఆర్వోలు వంశీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారం

ఓజిలి: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరిస్తున్నట్టు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. మండలంలోని మండలంలోని గ్రద్దగుంట, అగ్రహారం గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో దాసరి నిరంజన్, నలజాం రాజశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని వెంకటగిరి రోడ్డులో కట్టా రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టా సుధాకర్‌రెడ్డి దాతృత్వంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్ నిర్మించారు. దాన్ని శనివారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ షెల్టర్ కోసం కేఎస్ఆర్ సంస్థ రూ.15 లక్షలు ఖర్చు చేసిందన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెసల జయరాజగోపాల్, సెక్రటరి రామ్మోహన్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాయుడుపేటలో నిర్మించిన బస్ షెల్టర్

నగర వనం ప్రారంభం

మండలంలోని బిరదవాడ వద్ద జాతీయ రహదారి సమీపంలో అటవీ శాఖ 35 ఎకరాల్లో రూ.1.13 కోట్లతో ఏర్పాటుచేసిన నగర వనాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. మొక్కలు నాటారు. పట్టణంలోని పెసల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రాంభించారు. ఎస్.విజయభాస్కర్ రెడ్డి, పార్థు, సన్నారెడ్డి చంద్రారెడ్డి, పసల గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

బాలాయపల్లి (సైదాపురం) : ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఆసరాగా ఉంటుందని ఎస్ఐ కామినేని గోపి తెలిపారు. బాలాయపల్లిలోని వెంగమాంబపురం జూనియర్ కళాశాలలో శనివారం డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ శ్రీహరి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ చంద్రమౌళి తదితురలు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు రూరల్ : ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలుచేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును ప్రారంభించారు. నిర్వాహకులు నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు.

కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పెళ్లకూరు : ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.పుల్లయ్య, జి.బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. వారు శనివారం స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న పొరుగు రాష్ట్రాల కార్మికులతో కలిసి మాట్లాడారు. ప్రమాదకరమైన యంత్రాల వద్ద తగిన రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం వల్లే మూడు రోజుల క్రితం జరిగిన భారీ పేలుడులో ఒకరు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. 1979 కార్మిక చట్టాలను అమలు చేయడం లేదన్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే పొగ వల్ల పెన్నేపల్లి, తాళ్వాయిపాడు, కానూరు గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. నాయకులు మునిరాజా, గురవయ్య, ముకుంద, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన అగ్రహారం



అగ్రహారం గిరిజన కాలనీలో జ్వరంతో బాధపడుతున్న మహిళ



గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కలువాయి: మండలంలోని తోపుగుంట అగ్రహారం గ్రామంలో విష జ్వరాలు ప్రబలాయి. గత వారం రోజులుగా సుమారు 50 మందికి పైగ జ్వరాల బారిన పడ్డారు. గిరిజన కాలనీలో ఎక్కువ మంది జ్వరంతో మంచం పట్టారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు విజృంభిస్తున్నాయని, అందువల్లే జ్వరాలు ప్రబలుతున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. కొందరు కలువాయిలోని ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స చేయించుకుంటుండగా, మరికొందరు నెల్లూరులోని పలు వైద్యశాలలకు వెళుతున్నారు. జ్వరాలు ప్రబలిన విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది శనివారం తోపుగుంట అగ్రహారంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు కుల్లూరు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక తెలిపారు. రక్త నమూనాలు పరీక్షలకు పంపినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామంలో 8 యాక్టివ్ కేసులు ఉన్నాయని, పరిస్థితి అదుపులోనే ఉందన్నారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన బెల్టు షాపు వివాదం

చిల్లకూరు : తీర ప్రాంతంలోని చింతవరం కొత్తపాళెం గ్రామంలో బెల్టు షాపు నిర్వహణను రూ.1.25 లక్షలకు వేలం పాటలో సొంతం చేసుకున్నాడు. ఈ నగదును గ్రామంలో ఆలయ నిర్వాహణకు వినియోగించేలా ఒప్పందం ఉంది. దీనిపై గ్రామంలోని రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. దీంతో ఇరువర్గాల వారు శనివారం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు వారికి నచ్చజెప్పి పంపించేశారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

భక్తులకు అన్నదానం



గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం గోవింద మాలధారణ భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, శ్రీకంఠి రామోహన్‌రావు, చెంచురామయ్య, రహీం, శ్రీనివాసులు, ఆలయ ఈవో నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

11న శ్రీకాళహస్తిలో సంక్రాంతి సంబరాలు

నాయుడుపేట టౌన్ : శ్రీకాళహస్తిలో ఈ నెల 11న భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు నేతాజీ కళావేదిక కన్వీనర్ తాలేటి రామచంద్రయ్య తెలిపారు. వారు శనివారం వద్దిగుంటకండ్రిగలో వెంకటేశ్వర కోలాట భజన బృందం, కళారులతో కలిసి సంక్రాంతి సంబరాల కరపత్రాలు విడుదల చేశారు. ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ప్రచార కమిటీ సభ్యులు నెల్లూరు జయ రామయ్య, సుధాకర్ స్వామి, భాస్కర్, ముత్యాలు, మునుస్వామి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణ ఫార్మసీకి న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని గోకులకృష్ణ ఫార్మసీ కళాశాలకు న్యాక్ (ఎన్ఏఏసీ) ఏ గ్రేడ్ గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ బాలగాని పవన్ కుమార్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం 2024 నవంబర్ 25, 26 తేదీల్లో తమ కళాశాలలో తనిఖీలు చేపట్టిందన్నారు. గడిచిన ఐదేళ్లలో చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాలు, కళాశాల నాణ్యతా ప్రమాణాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా న్యాక్ కమిటీ సభ్యులకు వివరించామని తెలిపారు. బోధనా పద్ధతులు, మౌలిక వసతుల కల్పన తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఈ క్రమంలో కళాశాలకు ఏ గ్రేడ్ ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు వివరించారు. న్యాక్ ఇచ్చి ఏ గ్రేడ్ గుర్తింపుతో కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా (అటానమస్ స్టేటస్) రావడానికి కూడా అవకాశాలున్నాయని పవన్‌కుమార్ తెలిపారు. న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు సాధించడం ఎంతో గర్వంగా వుందని కళాశాల యజమానులు జీ బ్రహ్మయ్య, ఎంఎం కొండయ్య, సీ శ్రీనివాసబాబా హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, అధ్యాపకులను అభినందించారు.



న్యాక్ ఏ గ్రేడ్ సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్ బాలగాని పవన్‌కుమార్